శివపార్వతుల కల్యాణం చూతమురారండి

- గట్టుమల్లన్న ఆలయంలో నేడు వేడుకలు
- ఉగాది రోజున పంచాంగ శ్రవణం
- భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులోని గుట్టపైఉన్న గట్టుమల్లన్న ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. మల్లన్నను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. గట్టుమల్లికార్జునస్వామి మహిమగల దేవుడని భక్తుల నమ్మకం. గుట్టపైన ఉన్న ధర్మగుండంలో స్నానాలు ఆచరించి అందులోని నీటిని తీసుకువెళ్లి పంట పొలాలపై, పాడిపశువులపై చల్లితే బాగుంటాయని ప్రజలు విశ్వసిస్తారు. దీంతో మండల ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి గట్టు మల్లన్న ఆలయానికి నిత్యం భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

ప్రేమకు ప్రతిరూపం..

గట్టుమల్లన్నకు ఆరుగురు సోదరులు. అందులో అందరికంటే చిన్నవాడైన గట్టుమల్లన్న అంటే మిగితా సోదరులకు అమితమైన ప్రేమ. మల్లన్న సోదరుల్లో ఐలోని మల్లన్న, కొమురవెల్లి మల్లన్న, ఓదెల మల్లన్న, దుబ్బ మల్లన్న, కట్ట మల్లన్న సోదరుల తరువాత చివరివాడు గట్టు మల్లన్న. గుట్టపై దేవుళ్ల ప్రతిమలు ఉన్న విషయాన్ని యాదవులు ఆనాటి రాజుకు వివరించగా దేవుళ్లు వెలసినచోట ఆలయం నిర్మించినట్టు చరిత్ర చెబుతుంది. ఆలయంలో ప్రతీరోజు పురోహితులు పూజలు చేస్తుండగా యాదవులు ఒగ్గు కథలు చెబుతూ పట్నాలు వేస్తున్నారు. గట్టు మల్లన్నను పూజిస్తే సకల కష్టాలు దూరమవుతాయని, కుటుంబాలు సుభిక్షంగా ఉంటాయనే విశ్వాసంతో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, హైదారాబాద్, ఇతర ప్రాంతాల నంచి ప్రజలు భారీ సంఖ్యలో వచ్చి బోనాలు సమర్పించి పట్నాలు, పూజలు చేయడం నిత్యం జరుగుతూనే ఉంటుంది.

ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తే మేలు..

గుట్టపై ఉన్న ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తే మేలు జరుగుతుందని భక్తుల నమ్మకం. గుండంలోని నీటిని తీసుకువెళ్లి రైతులు తమ పంట పొలాలపై, పాడిపశువులపై చల్లుకుంటారు. ఆలయం చూట్టు పక్కల గ్రామాల ఒగ్గు పూజారులు ఆలయంలో ప్రత్యేక పట్నాలు వేసి ఒగ్గు కథలతో మల్లన్నను కొలుస్తారు. ఆలయం ముందున్న గండ దీపంలో నూనెపోస్తే గండాలు తప్పిపోతాయని నమ్మకం. గతంలో శివరాత్రి నుంచి ఉగాది వరకు మాత్రమే పూజలు నిర్వహించడం ఆనవాయితీగా ఉండేది. కానీ 15 ఏళ్లగా ఆలయంలో నిత్య పూజలు జరుగుతున్నాయి.


ఆలయ ఆవరణలో పట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు


ధర్మగుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు


గట్టు మల్లన్నకు పూజలు చేస్తున్న పూజారులు

ఆలయ ప్రత్యేకత..

వేలేరు, ధర్మసాగర్ మండలాల్లోని నారాయణగిరి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఏశబోయిన కొమురయ్య గొర్రెలు మేపేందుకు గుట్ట పరిసర ప్రాతంలోని అడవిలోకి వెళ్తాడు. ఒక్కసారిగా గొర్రెలు మాయమైపోతాయి. గొర్రెలను వెతికి అలసిపోయిన కొమురయ్య.. ఓ చెట్టు కింద సేద తీరుతుండగా ఆయన కలలోకి మల్లికార్జున స్వామి ప్రత్యక్షమవుతాడు. గుట్టపైన దుద్దిళ్ల పొగ వచ్చే చోట తాను నెలవై ఉన్నట్టు ఆచోటనే ఆయా దేవుళ్ల ప్రతిమలు కనిపిస్తాయని కొమురయ్యకు వివరిస్తాడు. దీంతో ఆయన గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయం గ్రామస్తులతో చెప్తాడు. కొంతమంది యాదవులు గుట్టపైకి వెళ్లి చూడగా పెద్దబండ రాళ్ల మధ్యలో ఉన్న ఓ పుట్టలో నుంచి దుద్దిళ్ల పొగ వస్తుంది. అందులో గట్టుమల్లికార్జున స్వామితో పాటు ఇతర దేవుళ్ల ప్రతిమలు కూడా కనిపించినట్టు గ్రామస్తులు చెబుతుంటారు. దీంతో యాదవ కుటుంబాలు అక్కడ పూజలు చేసి తిరిగి వస్తుంటే మాయమైన గొర్రెలు ఎదురుగా ప్రత్యక్షమైనట్లు ప్రచారంలో ఉంది. నాటి నుంచి మల్లికార్జునస్వామిని యాదవులు కులదైవంగా పూజిస్తున్నారు.

భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం..



మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 8న సాయంత్రం నిర్వహించే శివపార్వతుల కల్యాణానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తున్నాం. తాగునీరు, వైద్య సౌకర్యానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం రుద్రహోమం, సాయంత్రం శివపార్వతుల కల్యాణం, రాత్రి పెద్దపట్నం వేస్తాం.

- అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఈఓ

దళితబంధు కోసం ఆందోళన

- అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన, ఎమ్మెల్యే రేవూరికి వినతిపత్రం అందజేత


నిరసన తెలుపుతున్న నాయకులు

పరకాల : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కొనసాగించి అర్హులందరికీ అమలు చేయాలని దళితబంధు సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఏకు కార్తీక్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని దళితబంధు దరఖాస్తుదారుతో గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబంధుకు కావాల్సిన నిధులు కేటాయించి దరఖాస్తు చేసుకున్నవారందరికీ వర్తింపజేయాలని కోరారు. లేనిపక్షంలో దళితులంతా ఉద్యమబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్, దామెర జెడ్పీటీసీ కృష్ణమూర్తి, పరకాల, నడికూడ మండలాల కోఆర్డినేటర్‌లు శంకర్, భాస్కర్, పట్టణ అధ్యక్షుడు రఘుపతి, సుమన్, దేవేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా మహేందర్

ఎల్కతుర్తి : బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పిట్టల మహేందర్‌ను నియమిస్తూ హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ గురువారం ప్రకటనలో వెల్లడించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి, మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం మండలంలో సుమారు రూ. 12 కోట్లతో చేపడుతున్న బీటిరోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కొండపర్తి నుంచి ముల్కలగూడెం మీదుగా ఒంటిమామిడిపల్లి వరకు 6 కిలోమీటర్ల బీటీరోడ్డు పనులతో పాటు ఐనవోలు నుంచి రాంనగర్ వరకు రెండు వంతనలతో చేపట్టనున్న బీటీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ప్రజలు మార్పు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా పూర్తి చేస్తోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, సునీల్, రహీం పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి

ఐనవోలు : రైతులు అందించిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టరేట్ సూపరిండెంట్ అనంత రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ధరణి స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా ఫైళ్లను పరిశీలించారు. మండలంలో 503 దరఖాస్తులకు గాను ఇప్పటికే 274 దరఖాస్తులను పరిశీలించి విచారణ పూర్తి చేసినట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ వివరించారు. మిగిలిన 229 దరఖాస్తులను పరిశీలించి రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. డీటీ అనిల్‌కుమార్, ఆర్ఐ మరుపట్ల మల్లయ్య పాల్గొన్నారు.

కూలీలు ఉదయమే పనిలోకి వెళ్లాలి

ఐనవోలు: ఎండల తీవ్రత అధికంగా ఉంటున్నందున ఉపాధి హామీ కూలీలు ఉదయమే పనిలోకి రావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని నాగపద్మజ అన్నారు. గురువారం మండలంలోని పంథిని, పెరుమాండ్లగూడెం, ఐనవోలు గ్రామాలను నాగపద్మజ సందర్శించారు. ఈసందర్భంగా గ్రామాల్లో పంట కాలువలను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. రూ.272 కూలీ రావాలంటే ఎంత పనిచేయాలో తెలుసా? అని అడిగారు. వారితోనే కొలతలు పెట్టించారు. ప్రతీ గ్రామంలో 60 నుంచి 100 మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా అధికారులు చూసుకోవాలన్నారు. ప్రతీ రోజు రూ. 272 కూలీ వచ్చేలా కొలతలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీలను ఆదేశించారు. నర్సరీలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె మునగ, మారేడు, రాల చెట్లు పెంచాలని సూచించారు. అమెజాన్‌లో చింతగింజలు కొనుక్కునే పరిస్థితి దాపురించిందని, వీలున్న చోట చింత, వేపలను పెంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా నాగపద్మజ మండలంలో పర్యటించగా.. ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఏపీఓ నక్క కుమారస్వామి, ఈసీ ప్రదీప్, టెక్నికల్ అసిస్టెంట్ నీరజ, రమేశ్, పంచాయతీ కార్యదర్శులు తబస్సుమ్, కిశోర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజుకుమార్, ఎలేంద్ర ఆమెకు పూలబొకే అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే రేవూరి

పరకాల: మేడిగడ్డ, సుందిళ్ల రిజర్వాయర్లలో నీటి శాతం తక్కువగా ఉన్న దృష్ట్యా వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమస్యాత్మకంగా నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ఓపెన్ వెల్ నుంచి డైరెక్ట్‌గా నీటిని పంపింగ్ చేసేందుకు రూ.24.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం పరకాల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ టి.స్వర్ణలత అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ అధికారులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు ఎంతగానో దోహదపడే మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులును ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగకుండా ఉండేందుకు విద్యుత్ లైన్‌లు వేయడానికి రూ.16 లక్షల సీడీఆర్ నుంచి స్పెషల్ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రైతులకు కావాల్సిన యూరియ, ఎరువులను కొరత లేకుండా సరఫరా చేయాలని, రైతుల పంటలు ఎండిపోకుండా సాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మండల వ్యవసాయాధికారిని ఆదేశించారు. వేసవిలో ఎండదెబ్బ తగలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సిలువేరు మొగిళి, డిప్యూటీ తహసీల్దార్ నాగేందర్, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


వేలేరు : మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మిరెడ్డి


కమలాపూర్ : మహిళలను సన్మానిస్తున్న ఎంపీడీఓ గుండె బాబు

ఆత్మకూరు : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా ఓటర్లకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ముగ్గులపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అలాగే మా సోషల్ సర్వీస్‌సొసైటీ ఆధ్వర్యంలో మహిళా జీపీ కార్మికులకు సన్మానం చేసి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. స్వయం ఉపాధిని సృష్టించుకొని కుటుంబానికి అండగా నిలువాలన్నారు. ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, వైద్యాధికారిణి స్పందన, ఐకేపీ ఏపీఎం లలిత, మా సొసైటీ కార్యదర్శి నాగబండి శివప్రసాద్, కార్యదర్శి మేడ యాదగిరి, రాంబాబు పాల్గొన్నారు.

వేలేరు : మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో సత్తా చాటుతున్నారని అన్నారు. మహిళలు విద్యా, రాజకీయ, ఉద్యోగ పరంగా మరింత పురోగతి సాధించాలని కోరారు. అనంతరం మహిళా ఓటర్లకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యాలయ ప్రాగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ విమల తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ప్రాముఖ్యమైందని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహిళా ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న వాళ్లందరూ నిజాయితీగా ఓటు వేయాలన్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విమల, ఏపీఎం నారాయణ, సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రాక

ఎల్కతుర్తి : రాష్ట్ర రావాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శుక్రవారం భీమదేవరపల్లి మండలానికి రానున్నారు. మహాశివరాత్రి వేడుకలను పుస్కరించుకొని భీమదేవరపల్లి మండలం వంగర, ముత్తారం, త్రికుటేశ్వరాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

పార్టీవీడిన వారితో నష్టం లేదు

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : స్వార్థప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీని వీడిన వారితో పార్టీకి, తమకు నష్టమేమి లేదని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. హనుమకొండలోని ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకును బెదిరిస్తూ పార్టీ మారాలని చెప్పడం ఇతర పార్టీ నాయకులు మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అసత్య పునాదుల మీద అధికారంలోకి వచ్చిందని, అధికారం శాశ్వతం కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అత్యధిక సీట్లు ఇచ్చి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని అన్నారు.

ప్రజాపాలన సేవాకేంద్రం ఏర్పాటు

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఎంపీడీఓ ఫణిచంద్ర గురువారం ప్రారంభించారు. మహాలక్ష్మీ పథకం ద్వారా రూ. 500కు గ్యాస్, గృహజ్యోతి పథకం ద్వారా 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందించేందుకు సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మల్లన్న ఆలయంలో శివరాత్రి ప్రత్యేక పూజలు

ఐనవోలు : ఐలోని మల్లన్న ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండో రోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సమర్పించే నిత్య పూజలతో పాటు గవ్యాంత పూజలు, వాస్తుపూజ, పర్యగ్నికరణ, రుద్రహోమం, ప్రాతరౌపాసన బలిహరణ నిర్వహించారు. లింగోద్భవ కాలంలో స్వామిని అభిషేకించే 108 కలశాలను స్థాపించారు. కాగా.. స్వామి, అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఉదయం అశ్వవాహన సేవ, సాయంత్రం శేషవాహన సేవ మాడ వీధుల్లో నిర్వహించగా.. మహిళా భక్తులు కోలాటం వేస్తూ.. భజనలు చేస్తూ.. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పండితులు కొండప్రోలు శ్రీకాంత్ శర్మ, గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషితో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధం

- ఎంపీపీ స్వప్న

ఎల్కతుర్తి : పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధమని ఎంపీపీ మేకల స్వప్న అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్ ఎలక్ట్రానిక్ ఎడ్యూకేషన్ పాటిస్పేషన్) కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో అధికారులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. పౌరులకు ఓటు హక్కు వజ్రాయుధమన్నారు. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. 18సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవికుమార్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది. పంచాయతీ కార్యదర్శులు, మహిళలలు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లిలో గురువారం స్వీప్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా గ్రూపు మహిళలు, ఐకేపీ సిబ్బంది, మల్టీపర్పస్ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏపీఎం శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఓటరు ఆవశ్యకతను వివరించారు. 18ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.


ఎల్కతుర్తి : ముగ్గులు వేస్తున్న మహిళలు

విద్యార్థులకు చరిత్రను తిరగరాసే శక్తి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : సమాజంలోని అసమానతలను రూపుమాపి చరిత్రను తిరగరాసే శక్తి విద్యార్థినీ, విద్యార్థులకు ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సమాజ మార్పుతో పాటు చైతన్యం తీసుకురావడానికి విద్యాసంస్థలు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ప్రజలు చైతన్యవంతులైనప్పుడే పాలకులు సంక్రమంగా పాలన అందిస్తారని అన్నారు. పరకాల పట్టణంలోని గణపతి డిగ్రీ కళాశాలలో ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి, వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యార్థుల చదువుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతో మంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. సమాజంలో మార్పు తీసుకొచ్చే శక్తియుక్తులు విద్యార్థినీ, విద్యార్థులకు ఉందన్నారు. అదే విధంగా ప్రజలలో చైతన్యం వస్తనే రాజకీయాల్లో డబ్బు ప్రభావం తగ్గుతుందన్నారు. విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల ఇబ్బందులను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వలన విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి విద్యాసంస్థ చైర్మన్ చందుపట్ల నర్సింహారెడ్డి, ఎస్వీ విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి, సాహితి కళాశాల ప్రిన్సిపాల్ కురికాల జనార్దన్ రావు, శారదా విద్యాలయం ప్రిన్సిపాల్ మార్క సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

శాయంపేట : ప్రస్తుత సమాజం ఆన్‌లైన్‌తో ముడిపడి ఉందని, సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాల ప్రజలను టార్గెట్ చేస్తూ మోసం చేస్తున్నారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ మారెపల్లి క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం భారతీయ రిజర్వ్ బ్యాంక్ సహకారంతో వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాల ప్రజలను టార్గెట్ చేసి బహుమతులు గెలుచుకున్నారని తరుచు ఫోన్లు చేస్తూ వారికి మెసేజ్ పంపించి ఓటీపీ చెప్పాలని, బహుమతి ఇంటికి పంపిస్తామని మాయమాటలు చెబుతున్నారని అన్నారు. వారి మాటలకు ఆకర్షితులు కావొద్దని సూచించారు. బ్యాంక్ అధికారులు ముమ్మాటికి బ్యాంక్ ఎటీఎం నంబర్, ఓటీపీ, పాస్‌వర్డ్ అడగరని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఇలాంటి సమాచారం అడిగితే నిరాకరించాలని సూచించారు. అలాగే బ్యాంకు ఖాతా కలిగిన ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమాయోజన, సుకన్య సమృద్ధియోజన, అటల్ పెన్షన్ యోజన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా చేసుకొని కుటుంబానికి భరోసా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెపల్లి విజయ్, రవిపాల్, కృష్ణరెడ్డి, రామ్మూర్తి, స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి

శాయంపేట : గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను మరింత వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ షరీఫొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని పల్లెప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్ యార్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా శాయంపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఇంటి, నల్లా పన్నులను 100శాతం వసూలు చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో వీధిలైట్లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ సుభాషినితో కలిసి మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా మల్టీపర్పస్ సిబ్బందిని శాలువాతో సత్కరించారు. పంచాయతీకార్యదర్శి రత్నాకర్, కారోబార్ రమేష్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పరకాల : మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో గల సుదలమల్ల సమ్మయ్య వీధిలో రూ.7లక్షల నిధులతో సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులను మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్‌లాల్ మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కౌన్సిలర్ ఏకు రాజు, ఏఈ వంశీకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్‌అలీ, మాజీ జెడ్పీటీసీ బొల్లె భిక్షపతి, నాయకులు పసుల రమేష్, మార్క రఘుపతి, బండి సదానందం, సుదమల్ల రమేష్, స్వామి, శ్రీధర్‌రాజు, సురేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాయం కాంపౌండ్ నిర్మాణ పనులను ఎంపీపీ మార్క సుమలత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.4.5లక్షల నిధులతో కాంపౌండ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సారథ్యంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు, వైస్‌ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, నాయకులు పరికిరాల వాసు, రేవూరి జయపాల్‌రెడ్డి, అలువాల రవి, తనుగుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు సహకరించాలి

కమలాపూర్ : మండల కేంద్రంలో పద్మశాలి కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా సహకరించాలని సంఘం నాయకులు గురువారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్‌బాబును కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రణయ్ నిధుల మంజూరుకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, పట్టణ ప్రధానకార్యదర్శి పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షుడు దాసి శంకరయ్య, ఎంపీటీసీ మెండు రాధిక, మిట్టపల్లి ప్రభాకర్, శోభన్‌బాబు, మురళి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు